'దళితబంధు'పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ రాజర్షిషా
- ప్రజావాణికి 67 అర్జీలు


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: దళిత బంధు కింద చేపట్టిన పౌల్ట్రీ, పాడి పరిశ్రమల యూనిట్లు సమర్థవంతంగా నిర్వహించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. 67 అర్జీలు రాగా ఇందులో ప్రధానంగా ధరణి, భూ సమస్యలు, పోడు భూములు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆసరా పింఛన్లు తదితర అంశాలకు సంబంధించి ఉన్నాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల ఫిర్యాదుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను సమీక్షిస్తూ దళితబంధు కింద చేపట్టినపాడి పరిశ్రమల యూనిట్లు సమర్థవంతంగా నిర్వహించేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. విద్యుతు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు లబ్ధిదారులు తమ వంతు వాటా చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఎస్సీ అభివృద్ధి అధికారి, పశు సంవర్ధక శాఖ అధికారులకు వివరించారు. ఇళ్ల పట్టాలు అందజేసిన 1234 లబ్ధిదారులకు సంబంధించి 1127 వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చగా మిగిలిన వివరాలను నేటితో పూర్తి చేయాలని డీఎస్‌ఓకు చెప్పారు. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, సరఫరా ఏజెన్సీలు పాలు, గుడ్లు సకాలంలో సరఫరా జరిగేలా చూడాలని మహిళా, శిశు సంక్షేమాధికారికి తెలిపారు. జిల్లాకు ఇంకా అవసరమైన 6వేల మెట్రిక్ టన్నుల యూరియా కోసం వ్యవసాయ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపామని జిల్లా వ్యవసాయాధికారి సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగింపుకు ఒకటిన్నర మాసాలే ఉన్నందున వంద శాతం టర్మ్ లోన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 15న సేవాలాల్ జయంతి సందర్భంగా మెదక్, నర్సాపూర్ నియోజక వర్గాల్లో ర్యాలీ, సభలు నిర్వహణ ఏర్పాట్లు చేయాలని, బీసీ అభివృద్ధి అధికారి, జిల్లా యువ జన క్రీడల అధికారికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీసీఈఓ వెంకట శైలేశ్, ఇతర అధికారులు జయరాజ్, శ్రీనివాస్, చందు నాయక్, జెంలా నాయక్, కేశూరం, విజయశేఖర్ రెడ్డి, సాయిబాబా, ఆశాకుమారి, రమేశ్‌కుమార్, విజయలక్ష్మి, కృష్ణమూర్తి, కరుణ, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేస్తున్నారు



నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో మన ఊరు - మనబడి పనుల కాంట్రాక్ట్‌ను గ్రామ సర్పంచ్ మల్లేశం దక్కించుకున్నారు. పనులు నాణ్యతగా చేయడం లేదు. ఇది నేను గమనించి అతన్ని నిలదీశాను. నాపై కక్షగట్టిన సర్పంచ్ అతని సోదరుడు, బావమర్ధితో కలిసి నాపై దాడిచేస్తున్నారు. గ్రామంలో ఉండనీయకుండా వెంటపడుతున్నారు.

– చెప్యాల రమేశ్, ఎస్ఎంసీ చైర్మన్, శేరిపల్లి

23 గుంటల భూమి ఎక్కిస్తలేరు



మా పట్టా భూమి కొత్త పాస్ పుస్తకం వచ్చాక 23గుంటల భూమి తప్పు పడింది. ఈ విషయమై గత ఏడాదికాలంగా తిరుగుతున్నాం. కానీ ఎవరు పరిష్కరిస్త లేరు. తహసీల్దార్ దగ్గరికి పోతే, కలెక్టరేట్‌లో ఆగిపోయిందని చెబుతున్నారు. ఇక్కడికొస్తే తహసీల్దార్‌ను కలవుమంటున్నారు. మా తిప్పలు ఎవరు పట్టించుకుంటలేరు.

– నర్సమ్మ, చిత్రియాల్, పాపన్నపేట

అధికారులు పట్టించుకుంటలె



నేను పొలం కొనుగోలు చేసి 20 ఏళ్లు అవుతుంది. అందులో నాపేరున పొలం కొంత మారింది. కొత్త పాస్‌బుక్‌లో 14గుంటల భూమి పడలేదు. దాని మార్పుకోసం ఏళ్ల తరబడి తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు.

– చాకలి వెంకయ్య, మిన్‌పూర్

నిధులు కేటాయించాలి



రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం జరిగింది. ప్రభుత్వం స్పందించి బీసీల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని బీసీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

– గుండు మల్లేశం, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

అన్యాయంగా తొలగించారు



పెద్దశంకరంపేట గ్రామ పంచాయతీలో పదేళ్లుగా బిల్‌కలెక్టర్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. బిల్‌కలెక్టర్ తన మిత్రుని కొడుకును పెట్టుకొని నన్ను తొలగించారు. దీంతో ఉపాధి కోల్పోయి నేను కుటుంబం రోడ్డున పడ్డాం. నాకు న్యాయం చేయాలి.

– దుర్గదాస్, పెద్దశంకరంపేట

క్లుప్తంగా

ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందిస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరగబోయే గ్రామ దేవతల మొదటి వార్షికోత్సవానికి రావాలని సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డిలకు గౌతాపూర్ గ్రామ నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు విఠల్, మాణిక్యరెడ్డి, అంజిరెడ్డి, భీమయ్య, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


చెక్కు అందిస్తున్న సునీతారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి అంజమ్మకు సంబంధించిన రూ. 60 వేల చెక్కును రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సోమవారం హైదరాబాద్‌లో గౌతాపూర్ గ్రామ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్, మాణిక్యరెడ్డి, విఠల్, అంజిరెడ్డి, భీమయ్య, నర్సింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో బీజేపీ నాయకులు లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. చేగుంటకు చెందిన మురళికి రూ.36 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గణేశ్‌రవికుమార్, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, సాయి ప్రసాద్, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న మున్సిపల్‌సిబ్బంది

నర్సాపూర్: పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా క్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. అందులో భాగంగా పట్టణంలోని రెండవ వార్డులో పైపులైను పాడైనట్లు తమ దృష్టికి వచ్చిందని, దానికి మరమ్మతులు చేయించి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.

పంట పరిశీలన

కొల్చారం(నర్సాపూర్): మండలం నుంచి వరిగుంతం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి క్షేత్రస్థాయిలో పర్యటించి, వరి పొలాలను పరిశీలించారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల కాలేజీలో సోమవారం కేలండర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సంగమేశ్వర్, జిల్లా జమైతుల్ ఉల్మా అధ్యక్షుడు మౌలానా మసిమోద్దీన్, అరబిక్ స్కూల్ ప్రిన్సిపాల్ హఫీజ్ ఖుద్బుద్దీన్, పలువురు మైనారిటీ నాయకులు షేక్ హుస్సేన్, దావూద్, షేక్ షరీఫ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల, కాలేజీలో ప్రభుత్వం నిర్దేశించిన ఖాళీల భర్తీకి తమతో సహకరించాలని ప్రిన్సిపాల్ కోరారు. కార్యక్రమంలో పలువురు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలో అభివృద్ధి పనులు ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్నట్లు ఎంపీపీ స్వరూప అన్నారు. సోమవారం ఎంపీపీ ఛాంబర్‌లో మండల పరిషత్ నిధులపై స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ.. 2023–24 కు సంబంధించి 15వ ప్రణాళిక సంఘం నిధులు రూ. 21.70 లక్షలు, రాష్ట్ర ప్రణాళిక సంఘం నిధులు రూ.6.50 లక్షలు ఉన్నాయన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, ఎంపీటీసీలు మోహన్‌రెడ్డి, నవనీత, సోనిశ్రీనివాస్‌నాయక్, బాబు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామంలో దుర్గమాత ఆలయం వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ జ్యోతి, రవిందర్‌రెడ్డి, భాగారెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

కలెక్టర్‌కు సన్మానం


కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: టీపీటీఎఫ్ నాయకులు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులో జాప్యం జరుగుతుందని, తగు చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్‌రామ్‌రెడ్డి, యాదగిరి, శశిధర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గోపాల్, నజీరొద్దీన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): దళితబంధు నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర మాదిగ సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధి కీసరి సిద్ధరాంలు అన్నారు. సోమవారం ఈ మేరకు రామాయంపేటలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, ప్రవీణ్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

'బాల్యవివాహాలు జరగకుండా చూడాలి'


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాలు, తండాల్లో బాల్యవివాహాలు జరగకుండా వీసీపీసీ కమిటీ సభ్యులు కృషి చేయాలని ఐసీడీఎస్ శివ్వంపేంట మండల సెక్టార్ సూపర్‌వైజర్ సంతోష తెలిపారు. సోమవారం మండలంలోని రూప్లతండా గ్రామ పంచాయతీలో వీసీపీసీ (గ్రామ బాలల పరిరక్షణ కమిటీ)ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ రాంసింగ్ అధ్యక్షత సమావేశం నిర్వహించి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. చైర్మన్‌గా సర్పంచ్ రాంసింగ్, కన్వీనర్‌గా అంగన్‌వాడీ టీచర్ మౌనిక ఉంటారని తెలిపారు. దీంతో పాటు ఉపాధ్యాయుడు, డ్వాక్రా మహిళ, విద్యా కమిటీ సభ్యుడు, వార్డుమెంబర్, ఏఎన్ఎం, స్వచ్ఛంద సంస్థలతో పాటు యూత్ సభ్యుడు, మతపెద్ద మొత్తం 14మంది సభ్యులు ఉంటారని చెప్పారు. వీరు గ్రామాలు, తండాల్లో బాల్యవివాహాలు జరగకుండా కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంసింగ్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, అంగన్‌వాడీ టీచర్ మౌనిక, తండావాసులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల బెడదను నివారించండి


మాట్లాడుతున్న సర్పంచ్ అనూష

నిజాంపేట(మెదక్): గ్రామంలో కోతుల, కుక్కల బెడద ఎక్కువ ఉందని, వాటి నుంచి రక్షించాలని గ్రామస్తులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం గ్రామ సర్పంచ్ అనూష అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీకి సంబంధించి ఇంటి పన్ను వసూలు రూ. 3.54లక్షలు వసూలు చేశామని తెలిపారు. గ్రామంలో దోమలు ఎక్కువ అయ్యాయని, వాటి నివారణకు గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించాలని పలువురు గ్రామస్తులు సర్పంచ్‌ను కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబు, గ్రామ కార్యదర్శి నర్సింలు, లైన్‌మెన్ రమేశ్, వార్డు మెంబర్ తిర్మల్‌గౌడ్, మావురం రాజు, తాడెం తిరుపతి, యేసుమణి, అంగన్‌వాడీ టీచర్లు, రేణుక, దుర్గేశ్వరీ, అరుణ శ్రీ, సుగుణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఆశ కార్యకర్తలు బండారి అనిత, లక్ష్మి, బాలమణి, గ్రామస్తులు లక్ష్మీనర్సింలు, గర్గుల శ్రీనివాస్, వెంకటేశం, లక్ష్మణ్, రమేశ్, శేఖర్ మల్లేశం, గాండ్ల విఠల్, చంద్రశేఖర్, దుబ్బ రాజయ్య, ప్రసాద్, శ్రీకాంత్, కారోబార్ కొండల్‌రెడ్డి, వాటర్ మెన్ దేవుని రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న నవ్య

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ తండాలో సేంద్రియ కూరగాయల సాగుపై ఐఎఫ్‌డీసీ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం ఖాజాపూర్ తండాలోని గిరిజన రైతులకు 16 రకాల కూరగాయల విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌డీసీ సంస్థ ఆర్గనైజర్ నవ్య మాట్లాడుతూ.. సేంద్రియ కూరగాయల సాగు చేస్తే వారికి అవసరమైన సలహాలు ఇస్తామన్నారు. సర్పంచ్ జమ్కి, ఉపసర్పంచ్ విజయ, నాయకులు గోపాల్‌నాయక్, రాకేశ్‌నాయక్, రవి, రమేశ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు

మెదక్ మున్సిపాలిటీ: నియోజకవర్గంలోని 9 గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా ఎస్టీ ఎస్‌డీఎఫ్ భవనాలు మంజూరు అయినట్లు తెలిపారు. హవేలీఘనపూర్‌లోని కొచ్చెరువుతండా, చిన్నశంకరంపేటలోని గవ్వలపల్లితండా, జంగరాయితండా, కామారం తండా, కాజాపూర్‌తండా, మిర్జాపల్లితండా, సంకాపూర్‌తండా, అదేవిధంగా పాపన్నపేటలోని అంరియా తండా, దాక్య తండా, పొడ్చానపల్లి తండా గ్రామాలకు నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్స్ మంజూరు అయినట్లు చెప్పారు.

బియ్యం మార్చేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఐ

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఈసారి సరఫరా ఆయన రేషన్ బియ్యం నాణ్యతగా ఉండడం లేదు. దీంతో సోమవారం 'సాక్షి' దినపత్రికలో రేషన్ బియ్యం.. నాసిరకం అన్న వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ శ్రీహరి ఆధ్వర్యంలో ఉదయం మండలంలోని సంగాయిపేట, రంగంపేటలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేసి బియ్యాన్ని పరిశీలించారు. బియ్యం నాసిరకంగా సరఫరా అయిన విషయం తెలిసిందని, ఈ విషయంపై ఉన్నత అధికారులకు నివేదిక ఇచ్చినట్లు ఆర్‌ఐ తెలిపారు. వీలైనంత త్వరగా బియ్యాన్ని మార్చి ఇచ్చేందుకు డీఎస్‌ఓ గోదాం సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


శివ్వంపేట(నర్సాపూర్): మల్లన్న ఉత్సవాల్లో సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నగరం గ్రామంలో సోమవారం జగదాంబ సేవాలాల్ మొదటి వార్సికోత్సవం సందర్భంగా గిరిజనులు పోచమ్మకు బోనాలు ఊరేగించి, సమర్పించారు. ఈ మేరకు సేవాలాల్ జగదాంబ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గేమ్ సింగ్, ఎంపీటీసీ లలిత రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెన్నాపూర్‌లో మల్లన్న జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో మల్లన్న జాతర సోమవారం కనుల పండువగా జరిగింది. అందులో భాగంగా ఉత్సవ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులే కాకుండ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో యాదవ సంఘం మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం అగ్ని గుండాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత రెడ్డి హాజరయ్యారు.

సంక్షిప్త వార్తలు

◆ మోడల్ స్కూల్ దరఖాస్తులకు రేపే ఆఖరు గడువు

రేగోడ్(మెదక్): 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 15తో ముగియనుందని మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాశ్ సోమవారం తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7–10 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు మోడల్ స్కూల్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

◆ విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో నిర్మిస్తున్న బీరప్ప ఆలయానికి శివ్వంపేటకు చెందిన వెంకటరమణ భారత్ గ్యాస్ యజమాని పూలిమామిడి నవీన్‌గుప్తా రూ. 21 వేల విరాళం సోమవారం అందజేశారు. రవిగౌడ్, గణేశ్, నగేశ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

◆ వైభవంగా ఆలయ వార్షికోత్సవం

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలతభాగ్యరాజ్, ఉపసర్పంచ్ సంతోష్, వార్డు సభ్యులు రమ్య, ఏఎన్ఎం అనురాధ, యాదవ సంఘం నాయకులు కిష్టయ్య, పెద్దల యాదయ్య, కిష్టయ్య, నాగరాజు, యాదవ సంఘం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

◆ బ్రహ్మకుమారీల సేవలు మరువలేం

రామాయంపేట(మెదక్): సమాజానికి బ్రహ్మకుమారీల సేవలు మరువలేమని ఎంపీపీ సబిత పేర్కొన్నారు. నార్సింగి మండల కేంద్రంలో సోమవారం ఈశ్వరీయ జ్ఞానామృత మురళీ బ్రహ్మకుమారీ ఆశ్రమంలో ఎంపీపీ సబిత పతకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూజాత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబు, పట్టణాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు రామ్మోహన్, లక్ష్మణ్, సిద్ధిరాంరెడ్డి, నిర్మల, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రతీ గ్రామంలో పనులు నిర్వహించాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతీ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనులు నిర్వహించాలని ఎంపీడీఓ నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. హరితహారంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకునే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ అనీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

◆ గెలుపోటములు సహజం



శివ్వంపేట(నర్సాపూర్): క్రీడల్లో గెలుపోటములు సహజమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆమె హాజరై.. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీపీ హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మన్సూర్, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, సర్పంచ్ రవినాయక్, బీఆర్ఎస్ నాయకుడు గంగాధర్, మహిపాల్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, విరేశ్, పూల్‌సింగ్ ఉన్నారు.

◆ ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్యం

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ఆయుష్మాన్ భారత్‌తో నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతీ ఒక్కరికి రూ. 5 లక్షల ఉచితం వైద్యం అందుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వెల్మకన్న గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ రాజేందర్ తెలిపారు. సోమవారం మండలంలోని వెల్మకన్న గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తులతో ఆయుష్మాన్ భారత్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులు చేశారు.

◆ ఉపాధ్యాయుడికి కన్నీటి వీడ్కోలు

మెదక్ రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామానికి చెందిన పెద్దనొళ్ల పెంటయ్య హవేళిఘనపూర్ మండలం తిమ్మాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు సోమవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఉపాధ్యాయుడి మృతితో రాజ్‌పల్లి, తిమ్మాయిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

◆ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బీమ్లా సర్పంచ్ చెన్నానాయక్, నిర్వాహకులు నరేశ్ నాయక్, దేవేందర్‌నాయక్ అన్నారు. బుధవారం సేవాలాల్ జయంతి రోజున మద్యం, మాంసంకు దూరంగా ఉండాలని, వాట్సాప్ డీపీలో సేవాలాల్ మహరాజ్ ఫొటోను పెట్టుకోవాలని కోరారు.

◆ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): 33 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిని అక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు మల్లవరం వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మండలంలోని దొంతి గ్రామంలో సర్వే నంబర్ 702ఈలో 6 గుంటల భూమిని రాజసురేందర్ (దొంతి దొర) వద్ద కొనుగోలు చేశామన్నారు. ఒకరు ఇది తన భూమి అంటూ ఇబ్బందులకు గురిచేస్తూ వారి స్థలంలో కేజీవీల్ ట్రాక్టర్ పెట్టారని, మా భూమికి సంబంధించి పూర్తి ఆధారాలతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆ ట్రాక్టర్‌ను తొలగించారన్నారు.

◆ పాల ఉత్పత్తి పెంచాలి

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు పాల ఉత్పత్తి పెంచేలా కృషి చేయాలని హెరిటేజ్ డెయిరీ రీజినల్ మెనేజర్ నర్సింగరావు అన్నారు. సోమవారం పెద్దగొట్టిముక్ల గ్రామంలో పాల ఉత్పత్తిదారులకు అవగాహన కల్పించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


నర్సాపూర్: మాట్లాడుతున్న కౌన్సిలర్ సునీత

నర్సాపూర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ సునీత కోరారు. సోమవారం 9వ వార్డులోని పెద్దమ్మ కాలనీలో వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలనీవాసులు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. శిబిరంలో వసతులపై ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలని ఆమె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాహిత్యరత్న, ఇతర సిబ్బందికి సూచించారు.

కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చందునాయక్ సోమవారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో పెద్దమ్మ కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కాగా మెడికల్ ఆఫీసర్ సాహిత్య రత్న మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన శిబిరాల వివరాలను వివరించారు.

పెద్దశంకరంపేట(మెదక్): పేటలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని వైద్యుడు వికాస్ పరిశీలించారు. కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు ప్రోగ్రాం వైద్యాధికారి హర్ష, పిహెచ్సి సిబ్బంది సంపూర్ణ, స్వప్న, వెంకటేష్, సాయిలు, సంజయ్, నాగమణి, సంతోష తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామంలో సోమవారం గ్రామ సర్పంచ్ చంద్రవర్ధిని, ధర్మారం పీహెచ్‌సీ ఆస్పత్రి వైద్యురాలు హరిప్రియ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంజీవులు, హెల్త్ సూపర్‌వైజర్ శ్యామల, మెడికల్ ఆఫీసర్ మార్గదర్శిని, శ్రీనివాస్, ఏఎన్ఎం రమ్య, కళ్యాణి, మంజుల, వార్డు సభ్యులు అనూష, బాలరాజ్, యాదగిరి, గ్రామస్తులు తదితరులున్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో ఎంపీటీసీ భాగ్య కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత, ఏఎన్ఎం షమీం, భాగ్య, ఆశవర్కర్లు రాజవ్వ, స్వప్న, వెంకటలక్ష్మి, సుజాత అంగన్‌వాడీ కార్యకర్త బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజ్‌పల్లి, దేవులపల్లి గ్రామాల్లో కంటి వెలుగు వైద్యశిబిరాల్లో వైద్యపరీక్షలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ముత్రాజ్‌పల్లిలో డాక్టర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో 157 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సంజీవ్, ప్రమీళ, ఎంపీటీసీలు ప్రవీణ్‌కుమార్, జ్యోతి పర్యవేక్షించారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందాపూర్ గ్రామంలో కంటివెలుగు కేంద్రాన్ని సర్పంచ్ రమాదేవితో కలిసి ఎంపీపీ భాగ్యలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.